'తులసి'తో జ్ఞాపకశక్తి మెరుగు

భారతీయులు పవిత్రంగా భావించే 'తులసి' ఇప్పటికే మన దేశంలో ఆయుర్వేద ఔషధాల్లో ప్రసిద్ధి చెందింది. అయితే, మనుషుల సంపూర్ణ ఆరోగ్యానికి 'తులసి' దోహదపడుతున్నదని 'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' తన పరిశోధనలో తేల్చింది. తులసి జ్ఞాపకశక్తిని మెరుగుపర్చడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తున్నట్టు తాజాగా వెల్లడించింది. దీంతో తులసి మొక్క ప్రాముఖ్యత గ్లోబల్ స్థాయికి చేరినట్లయింది.

- జీవన క్రియల పెంపు
- ఒత్తిడి తగ్గించడంతోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది
- గుండెపోటు రిస్క్ తగ్గుదల
- 'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' వెల్లడి

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): తులసి వివిధ రకాల ఒత్తిళ్లను తగ్గించడంతో పాటు రద్దీ ప్రదేశాల్లో నివాసం ఉండేవారిని కాలుష్యం నుంచి కాపాడుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. పనిచేయడం వల్ల కలిగే శ్రమ, చలి, పెద్ద శబ్దాల నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు శరీర సమతుల్యతకు తోడ్పాటు అందిస్తున్నట్టు పేర్కొంది. బీపీ, రక్తంలో చక్కెరలు, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను తగ్గిస్తున్నట్టు పరిశోధనలో తేలింది. డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతున్నదని తెలిపింది. రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడంతో పాటు లిపిడ్ ప్రొఫైల్‌ను మెరుగుపర్చడం, మానవ శరీరంలోని జీవన క్రియలను పెంపొదిస్తున్నట్టు ఆ నివేదిక వెల్లడించింది.

తులసితో మరిన్ని ప్రయోజనాలు ఇలా..

యాంటీ బ్యాక్టరీయా గుణాలు ఉన్న తులసి అనేక రకాల వైరస్‌లతో పోరాడుతున్నదని, జలుబును నివారించడంతోపాటు హ్యాండ్ శానిటైజర్, మౌత్ వాష్‌గా పనిచేస్తున్నట్టు ఆ పరిశోధనలో వెల్లడైంది. యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా రోగాల బారిన పడకుండా కాపాడుతున్నదని నివేదిక పేర్కొంది. మనిషి సానుకూల దృక్పథంతో ఉండేందుకు, ఆందోళన, డిప్రెషన్‌కు గురికాకుండా పనిచేస్తున్నట్టు తెలిపింది. మనిషిలో ఒత్తిడిని తగ్గించేందుకు మెదడులోని రసాయనాలైన డొపమైన్, సెరొటొనిన్‌ను బ్యాలెన్స్ చేస్తున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. మన దైనందిన జీవనంలో రేడియషన్ల వల్ల కలిగే నష్టం నుంచి మన శరీరాన్ని రక్షించడంలో తులసి సహాయపడుతుందని, హాని కలిగించే పదార్థాల నుంచి కాపాడటంలో భాగంగా కాలేయ ఎంజైమ్‌ల ఉత్పత్తికి తోడ్పాటునందిస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. ఈ చర్యతో మన శరీరంలో డీఎన్ఏకు కలిగే నష్టాన్ని తగ్గించి జీవకణాల ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్నట్టు స్పష్టం చేసింది. తులసిలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామెటరీ, యాంటీయాక్సిడెంట్ల కారణంగా గాయాలను త్వరగా తగ్గిస్తుందని పేర్కొంది. అల్సర్ నిరోధక ప్రభావాలు కలిగి ఉండటం, జీర్ణక్రియ సమస్యలు, కడుపునొప్పి, వాంతులు, విరేచనాల నుంచి ఉపశమనం కలిగిస్తున్నట్టు తెలిపింది. రక్తంలోని లిపిడ్‌ను తగ్గించడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడటంతో పాటు గుండెపోటు రిస్క్‌ను తగ్గిస్తుందని 'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' తన పరిశోధనలో వివరించింది.

పిల్లలే లేనప్పుడు..

మండలానికి 3 పబ్లిక్ స్కూళ్లు..
మరో 4 ఫౌండేషన్ స్కూళ్ల ఏర్పాటు

కొత్త స్కూళ్లు ఎందుకు?

- 2025-26లో వంద మండలాల్లో ప్రారంభించాలన్న విద్యాకమిషన్
- ఇప్పటికే ఒక్కో పాఠశాలలో సగటున 14 మంది విద్యార్థులే
- పిల్లలు లేక మూతబడుతున్న స్కూళ్లు.. వీటితో మళ్లీ సర్కారు బడులపైనే ఎఫెక్ట్
- ప్రభుత్వ బడులు మూసివేసేందుకు కొత్త ఎత్తుగడ అంటున్న సంఘాలు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 41,647 స్కూళ్లల్లో.. ఒక్కో తరగతికి 5.5లక్షల మంది విద్యార్థులున్నారు. అంటే సగటున ఒక పాఠశాలలో ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్య 14లోపే. స్కూళ్లు ఎన్ని ఉన్నా తరగతికి 5.5లక్షల మంది విద్యార్థులనే పంచుకోవాలి. వాస్తవ పరిస్థితులిలా ఉంటే రాష్ట్రంలో 2030-31కల్లా కొత్తగా 4,291 సర్కారు స్కూళ్లను ప్రారంభించాలని తెలంగాణ విద్యాక మిషన్ సిఫారసు చేసింది. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని సూచించింది. మండలానికి మూడు పబ్లిక్ స్కూళ్లు, 4 తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నది. మొదటి విడతలో 2025-26 విద్యాసంవత్సరంలో వంద నియోజకవర్గాల్లోని 100 మండలాల్లో పబ్లిక్, ఫౌండేషన్ స్కూళ్లను ప్రారంభించాలని విద్యాకమిషన్ సూచించింది. ఆరు విడతల్లో 4,291 స్కూళ్లను ఏడాదికి కొన్ని చొప్పున ఏర్పాటు చేయనున్నది. మొత్తం 632 మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు రూ. 22,752కోట్లు, ఫౌండేషనల్ స్కూళ్లకు రూ, 8,848 కోట్ల చొప్పున రూ. 31,600కోట్లు ఖర్చవుతుంది. ఒక వైపు ఉన్న స్కూళ్లే విద్యార్థుల్లేక సతమతమవుతున్నాయి. మరోవైపు పుట్టే పిల్లలేమో తగ్గుతున్నారు. ఇప్పటికే 14 మంది విద్యార్థులకు ఒక స్కూల్ చొప్పున నడుస్తున్నప్పుడు, కొత్తగా 4వేల స్కూళ్లు తెరిచి ఏం లాభం అన్న వాదనలొస్తున్నాయి. కొత్తగా స్కూళ్లు తెరిస్తే చేరేదెవరు.. వచ్చేదెవరు. ఈ స్కూళ్లకు టీచర్లను

ఎక్కడి నుంచి తెస్తారని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

మూసివేయడం ఖాయం

ఒక్కో పబ్లిక్ స్కూల్లో మొత్తం విద్యార్థుల సంఖ్య 1,500 అంటే ఒక మండలంలో 4,500 మంది ఈ పాఠశాలల్లోనే చేరుతారు. మండలానికి నాలుగు ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేస్తే, ఒక్కోదాంట్లో 250 మంది చొప్పున మొత్తం వెయ్యి మంది చేరుతారు. అంటే ఒక్కో మండలంలో 5,500 మంది వీటిల్లోనే ప్రవేశాలు పొందుతారు. రాష్ట్రంలోని 632 మండలాల్లో మండలానికి 5,500 మంది చొప్పున 34.76లక్షల మంది పబ్లిక్, ఫౌండేషన్ స్కూళ్లల్లోనే చేరుతారు. రాష్ట్రంలోని మొత్తం విద్యార్థులే 50లక్షలు. మిగిలింది 26 లక్షల మంది విద్యార్థులే. విద్యాశాఖ లెక్కల ప్రకారం ఇప్పటికే 35 లక్షల మంది ప్రైవేట్ బడుల్లో చదువుతున్నారు. అంటే ప్రభుత్వ, జిల్లా పరిషత్ బడులకు సమాధి కట్టడం ఖాయంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలో 491 మండలాల్లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలున్నాయి. మరో 194 మండలాల్లో మాడల్ స్కూళ్లున్నాయి. మండలంలో ఒకటి రెండు గురుకులాలున్నాయి. దీంతో సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గిపోయింది. పిల్లలు లేక స్కూళ్లు మూతబడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, ఫౌండేషన్ స్కూళ్ల రాకతో మళ్లీ ప్రభుత్వ, జిల్లా పరిషత్ స్కూళ్లపైనే ప్రభావం పడుతుంది. సర్కారు స్కూళ్లను వదిలించుకునేందుకు, మూసివేసేందుకు ఇది సర్కారు కొత్త ఎత్తుగడ అని టీచర్ల సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

ఒకటో తరగతి 75% ప్రైవేట్‌లోనే!

సర్కారు బడుల్లో ఉన్నది 25% విద్యార్థులే

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న ఎన్‌రోల్‌మెంట్
మరో పదేండ్లు ఇదే పరిస్థితి ఉంటే
సర్కారు బడుల మనుగడ కష్టమే

రాష్ట్రంలో ఒకటో తరగతిలో మొత్తంగా 6,09,654 మంది విద్యార్థులుంటే వీరిలో 75% విద్యార్థులు ప్రైవేట్ బడుల్లోనే చదువుతున్నారు. కేవలం 25% మాత్రమే సర్కారు బడుల్లో చదువుతున్నారు. ఇది విద్యాశాఖ చెబుతున్న లెక్కలు.

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : ఒకటో తరగతి వారిప్పుడు రెండో తరగతికి.. ఇలా పైతరగతులకు ప్రమోట్ అవుతారు. ఇదే ట్రెండ్ మరి కొంత కాలం కొనసాగితే సర్కారు స్కూళ్లల్లో విద్యార్థులుంటారా.. ? అంటే కష్టంగానే కనిపిస్తున్నది. ఓ పదేండ్ల తర్వాత సర్కారు స్కూళ్లు కనుమరుగు కావడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇప్పటికే సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ ప్రమాదఘంటికలు మోగిస్తున్నది. 2-10 తరగతుల్లో ప్రైవేట్‌లో 59% విద్యార్థులుంటే సర్కారు బడుల్లో కేవలం 31శాతమే విద్యార్థులున్నారు. మరో 10% విద్యార్థులు గురుకులాలు, కేజీబీవీల్లో చదువుతున్నారు. ఈ ఉదాహరణలు సర్కారు స్కూళ్ల పరిస్థితికి అద్దంపడుతున్నాయి. భవిష్యత్తును హెచ్చరిస్తున్నాయి. సర్కారు స్కూళ్లపై నమ్మకం తగ్గుతుండటం, ప్రైవేట్‌పై మోజు పెరుగుతుండటమే ఇందుకు కారణం. టీచర్లు సరిగ్గా పాఠాలు చెప్పడంలేదని, బాధ్యతతో నడుచుకోవడం లేదని సర్కారు నిందిస్తుండగా, టీచర్లేమో స్కూళ్లల్లో వసతుల్లేవు. పర్యవేక్షణలేదంటారు. ఇలా ఒకరిపై ఒకరు నిందలేసుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నారు.

వాస్తవ పరిస్థితులిలా..

- రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరంలో 1,899 సర్కారు బడుల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదయ్యింది. మూడేండ్ల క్రితం వీటి సంఖ్య 1,100 లోపే ఉండగా, మూడేండ్లల్లోనే 1,899కి పెరిగింది. వీటిలో 1,811 ప్రాథమిక పాఠశాలలే.
- సర్కారు స్కూళ్లు ఇలా మూసివేతకు సిద్ధంగా ఉండగా, మరో వైపు ఈ విద్యాసంవత్సరం మరో 350 ప్రైవేట్ స్కూళ్లకు విద్యాశాఖ అనుమతి ఇచ్చింది. ఏటా 300-400 స్కూళ్లకు అనుమతులు ఇస్తున్నది.
- రాష్ట్రంలో 26,861 సర్కారు బడులున్నాయి. వీటిలో ఎన్‌రోల్‌మెంట్ కేవలం 31.93శాతమే. ప్రైవేట్ స్కూళ్ల సంఖ్య 11,489 ఉండగా, వీటిల్లో ఎన్‌రోల్‌మెంట్ 59శాతముంది. అంటే 64.5శాతమున్న సర్కారు బడుల్లో 31శాతం ఎన్‌రోల్‌మెంట్ ఉండగా, 27.59శాతమున్న ప్రైవేట్ బడుల్లో 59శాతం విద్యార్థులున్నారు.
- రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం సర్కారు బడుల్లో 1.5లక్షల మంది విద్యార్థులు పదోతరగతి పూర్తిచేశారు. అంటే వీరంతా బడి నుంచి బయటికెళ్లినట్టే లెక్క. మొత్తంగా సర్కారు బడుల్లో 18లక్షల మంది విద్యార్థులుండగా ఈ 1.5లక్షల మంది వెళ్లిపోవడంతో ఎన్‌రోల్‌మెంట్ 16.5లక్షలుకానుంది. కొత్తగా మరో 1.5లక్షల మంది చేరితేనే ఈ ఎన్‌రోల్‌మెంట్ మళ్లీ 18లక్షలవుతుంది.

11 రకాల పంటల సాగు అంతంతమాత్రమే

చింతపండు, అల్లం, వెల్లుల్లికి కొరతే
మరో 1.78 లక్షల టన్నుల ఉత్పత్తి అవసరం

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): మిర్చి, పసుపు సాగులో అగ్రగామిగా ఉన్న తెలంగాణ ఇతర సుగంధ ద్రవ్యాల సాగులో తీవ్రంగా వెనుకబడిపోయింది. నిత్యం వంటింట్లో వినియోగించే చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర తదితర 11 రకాల మసాలా దినుసులకు కొరత ఏర్పడింది. చివరికి చింతపండును కూడా దిగుమతి చేసుకునే పరిస్థితి నెలకొంది. సరైన పంటల ప్రణాళికలను రూపొందించకపోవడంతో ఏండ్లు గడుస్తున్నా దిగుమతులు తగ్గడం లేదు. దీంతో రైతుల ఆదాయాలు తగ్గడంతో పాటు ప్రజలకు ధరల భారం తప్పడం లేదు.

భారీగా పసుపు, మిర్చి సాగు

నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, వరంగల్ రూరల్, మహబూబాబాద్ జిల్లాల్లో పసుపు ఎక్కువగా సాగవుతోంది. 56 వేల ఎకరాల్లో 1.74 లక్షల టన్నుల పసుపు ఉత్పత్తి అవుతున్నట్టు ఉద్యాన శాఖ లెక్కలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో రోజువారీ పసుపు వినియోగం 56.25 టన్నులు. ఏటా రాష్ట్ర అవసరాలకు 23 వేల టన్నులు సరిపోతుంది. మిగితా పసుపు ఎగుమతి అవుతున్నది. మిరప ఉత్పత్తిలో ఏపీ తర్వాత తెలంగాణ రెండో స్థానంలో ఉన్నది. రాష్ట్రంలో దాదాపు 2.78 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. దీంతో ఏటా 5.73 లక్షల టన్నుల ఎండు మిర్చి ఉత్పత్తి అవుతున్నది. రాష్ట్రంలో రోజువారీగా కారం వినియోగం 93 టన్నులు. ఏటా రాష్ట్ర అవసరాలకు వాడేది 39 వేల మెట్రిక్ టన్నులు. మిగతా 5.34 లక్షల టన్నులు ఎగుమతి చేస్తున్నారు.

చింతపండు, అల్లం, వెల్లుల్లి కూడా దిగుమతే

లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, జాపత్రి, జీలకర్ర వంటి విలువైన సుగంధ ద్రవ్యాలను ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి తెలంగాణ దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. వాటితోపాటు ప్రస్తుతం చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలను కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. ఏటా 61,564 టన్నుల చింతపండును దిగుమతి చేసుకొంటున్నారు. 47,930 టన్నుల అల్లం ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నది. వెల్లుల్లి 148 టన్నుల ఉత్పత్తి అవుతుండగా రాష్ట్రంలో వినియోగం మాత్రం 39,417 టన్నుల మేర ఉంటోంది.

సుగంధ ద్రవ్యాల సాగు అవసరం

రాష్ట్రంలో రోజూ సగటున ఒక్కొక్కరు 21.21 గ్రాముల సుగంధ ద్రవ్యాలను వినియోగిస్తారు. ఇలా ఏటా 2.63 లక్షల టన్నులు అవసరమవుతాయి. చింతపండు,అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర, ఆవాలు, మిరియాలు లాంటి 11 సుగంధ ద్రవ్యాలు 1.78 లక్షల టన్నులు అవసరమవుతాయి.

టెండర్.. ఆరోసారి!

280 సబ్‌స్టేషన్లకు మరోమారు టెండర్లు

ఐదుసార్లు పిలిచినా స్పందన కరువు.. ఆరోసారీ మారని నిబంధనలు

అనుకూల వ్యక్తులకు కట్టబెట్టే యత్నం!

హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు పాలన పడకేసింది. అసలు ఆ సంస్థల్లో ఏం జరుగుతున్నదో ఎవరికీ అంతుబట్టడంలేదు. గతంలో బీఆర్ఎస్ పార్టీ తీసుకున్న చర్యలను గుడ్డిగా వ్యతిరేకించడం, ప్రతీ పనిలోనూ అమ్యామ్యాల కోసం ఎగబడటమే కనిపిస్తున్నది. దీనికి మరో ఉదాహరణ ఎస్పీడీసీఎల్. దీని పరిధిలో నిరుడు జూలై-ఆగస్టు నెలల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడైనా సబ్‌స్టేషన్లు నిర్మించాలంటే జిల్లాల వారీగా, డివిజన్ల వారీగా టెండర్లు పిలిచేవారు. సంబంధిత జిల్లా, డివిజన్ల యూనిట్‌గా తీసుకోవడంతో సబ్‌స్టేషన్ల సంఖ్య తక్కువ ఉండేది. స్థానిక కాంట్రాక్టర్లు వీటిలో పాల్గొని సబ్‌స్టేషన్ల నిర్మాణం, నిర్వహణ పనులు చేపట్టేవారు. కానీ, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తిగా కేంద్రీకృతం చేసింది. ఒకేసారి 280 సబ్‌స్టేషన్లకు జోన్లవారీగా టెండర్లు పిలిచింది. నిబంధనల్లో కూడా మార్పులు చేసింది. 280 సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులంటే బడా కంపెనీలు, బడా కాంట్రాక్టర్లు తప్ప, ఇతరులు వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో గత జూలై నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు టెండర్లు పిలిచినా స్పందన మాత్రం లేదు. దీంతో తాజాగా ఆరోసారి టెండర్లు పిలిచారు. టెండర్లు ఎందుకు ఖరారు కావడం లేదన్నదానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంట్లో ప్రధానమైనది డబ్బుల వ్యవహారమేనని చెప్తున్నారు. ఓ కీలక నేత, ఒక రిద్దరు అధికారులు కొత్త పద్ధతికి తెరతీశారని, ఆరుసార్లు టెండర్లు పిలిచినా రాలేదని చెప్పి తమకు అనుకూలమైన వారికి పనులు అప్పగించుకునేందుకు స్కెచ్ వేశారని చెప్తున్నారు.

టెండర్లయినా.. మెటీరియల్ రాదు

ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్‌కు చెందిన కొన్ని పనులు చాలా విచిత్రంగా ఉంటున్నాయి. ఒక కాంట్రాక్టర్‌కు మెటీరియల్ సరఫరాకు సంబంధించిన కాంట్రాక్టు దక్కింది. సుమారు 300 కోట్ల రూపాయల టెండర్ అది. వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ బుషింగ్ రాడ్లు, ఏబీ స్విచ్‌లు, బ్రేకర్లు.. ఇలా సబ్‌స్టేషన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు అవసరమైన సామగ్రిని అధికారులు ప్రతీ ఏడాది కొనుగోలు చేస్తుంటారు. నిరుడు కూడా కొన్నారు. వేసవి కాలం సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు వస్తుంటాయి. మరమ్మత్తులకు అవసరమైన మెటీరియల్ ఉంటే త్వరగా మరమ్మతులు పూర్తి చేసి పంపవచ్చన్నది మెటీరియల్ కొనుగోళ్ల వెనుక ఉన్న లక్ష్యం. అయితే, గతకొన్ని నెలలుగా జిల్లాల్లో ఉండే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) వర్క్‌షాపులలో, స్టోర్లలో ఎలాంటి మెటీరియల్ అందుబాటులో లేదు. దీనిపై స్థానిక అధికారులు ఉన్నతాధికారులను అడిగితే వస్తుంది, కొనుగోలు చేశామని చెప్తున్నారు. కానీ, మెటీరియల్ స్టోర్లలోకి రావడం లేదు. ఎందుకు రావడంలేదని ఆరా తీస్తే.. మెటీరియల్ కాంట్రాక్టర్ 'సమర్పించుకోవాల్సింది' ఇంకా సమర్పించుకోలేదట. కనీసం 5 శాతమైనా లేకపోతే ఎలా అని ఒకరిద్దరు అధికారులు, ఓ కీలక నేత దీన్ని ఆపివేయించినట్టు చెప్తున్నారు. మెటీరియల్ రాకపోతే పనులెలా చేసేదని కింది స్థాయి సిబ్బంది లబోదిబోమంటున్నారు.

పోస్టింగులో సూపర్ స్పీడ్

విద్యుత్తు శాఖలో కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు డబ్బులు ఇవ్వనిదే పని జరగదన్న ప్రచారం జోరుగా సాగుతున్నది. దీనికి బలం చేకూర్చేలా ఇటీవల ఒక సంఘటన జరిగిందని అధికారులు చెప్తున్నారు. జీహెచ్ ఎంసీ పరిధిలో ఓ అధికారి అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డాడు. ఆయనపై ఏసీబీ విచారణ ముగియకముందే ఆ అధికారి స్థానంలో జెట్ స్పీడ్‌తో మరో అధికారికి ఉత్తర్వులు ఇచ్చారు. ఏసీబీకి చిక్కిన అధికారి సస్పెన్షన్ ఉత్తర్వులు రాకముందే, ఏసీబీ పంచనామా ముగియక ముందే మరో అధికారికి పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది.

భయంగా ఉంది... బతకాలని లేదు!

పరీక్షల్లో మార్కులు తక్కువొస్తే అమ్మానాన్న తిడతారేమో!

- ఫెయిల్ అయితే అందరూ హేళన చేస్తారని బాధగా ఉంది
- టెలీమానస్‌కు ఫోన్‌చేసి గోడు చెప్పుకుంటున్న స్టూడెంట్స్
- మనోధైర్యం నింపి, విద్యార్థులను కాపాడుతున్న వైద్యులు
- విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు 14416
- లేదా 1800-891-4416కు కాల్ చేయాలని సూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ): కేశంపేటలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థి రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని నారాయణ కాలేజీలోని బైపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని ఫలితాలు చూసిన తర్వాత మానసిక ఒత్తిడికి గురై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో విద్యార్థిని ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షకు హాజరుకాకపోవడం వల్ల ఫెయిల్ కావడంతో ఆవేదనకు గురై తనువుచాలించింది. ఇలా.. ఇంటర్మీడియట్ ఫలితాలు రాష్ట్రవ్యాప్తంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులకు తీరని విషాదాన్ని నింపాయి. గొప్ప చదువులు చదివి ప్రయోజకులు అవుతారని కలలుగన్న ఆ కన్నవారికి శోకాన్ని మిగిల్చారు. ఫలితాలు విడుదలైన కొన్ని గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఆరుగురు విద్యార్థులు విగతజీవులయ్యారు. చదువే ప్రాణంగా ఎక్కువ మార్కులే లక్ష్యంగా ఏడాదంతా కష్టపడి చదివిన వాళ్లకు మార్కులు తగ్గడం, ఫెయిల్ కావడం వల్ల తల్లిదండ్రులు మందలిస్తారని, ఇరుగుపొరుగువాళ్లు హేళన చేస్తారని భావించి మానసిక ఒత్తిడికి గురై తనువుచాలించారు.

పరీక్షల పరుగులో అలసిన విద్యాకుసుమాలు

మానసిక సమస్యలతో బాధపడేవారికి కౌన్సిలింగ్, వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం టెలిమానస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. ఇందులోభాగంగా తెలంగాణకు సంబంధించి ఎర్రగడ్డ మానసిక వైద్యశాల నోడల్ ఏజెన్సీగా ఉంది. ఆత్మహత్యల నివారణే లక్ష్యంగా ఏర్పడిన టెలీమానస్ విద్యార్థులకు మరింత అండగా నిలుస్తున్నది. సాధారణ సమయంలో టోల్‌ఫ్రీ నం 14416 లేదా1800-891-4416కు రోజుకు 200 ఫోన్‌కాల్స్ వస్తే అందులో సుమారు 20కాల్స్ విద్యార్థులవే ఉంటున్నాయి. చదవలేకపోతున్నామని, పరీక్షల పట్ల ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదనను పంచుకుంటున్నారు. ప్రధానంగా పరీక్షల్లో మార్కులు తక్కువొస్తే అమ్మానాన్న తిడతారేమోనని, ఫెయిల్ అయితే అందరూ హేళన చేస్తారని బాధగా ఉందని చెప్పుకుంటున్నారు. కొందరైతే తీవ్ర ఆందోళనకు గురై



"భయంగా ఉంది... బతకాలని లేదు!" అని చెప్తున్నారు. ఇలా పరీక్షల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో విద్యార్థుల కాల్స్ సుమారు 40 వరకు ఉంటున్నాయి. అలాంటి వారి సమస్యలను వైద్యులు, మానసిక నిపుణులు ఓపికతో విని, తగిన పరిష్కారం చెప్తున్నారు. ఇక్కడ 20 మంది టెలీకౌన్సిలర్లు, ఇద్దరు సైకియాట్రిస్ట్‌లు, ఓ సైకాలజిస్ట్ అందుబాటులో ఉంటారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతూ ఒత్తిడి, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనల నుంచి పూర్తిస్థాయిలో బయటికి తీసుకొస్తున్నారు.

తల్లిదండ్రుల్లోనే మార్పు రావాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను గొప్పగా చూడాలని ఆశపడుతారు. పిల్లల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రుల ఇష్టాలను వారిపై బలవంతంగా రుద్దుతున్నారు. నేటి రోజుల్లో చాలామంది తల్లిదండ్రులు మార్కులు తక్కువొస్తే మందలించేవారే తప్ప, ధైర్యం చెప్పే వారు అరుదుగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల వల్లే విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఈ ఒత్తిడి పట్టణాల్లో అధికంగా ఉంది. ప్రతీ విద్యార్థిలో ప్రతిభ దాగి ఉంటుంది. ఆ ప్రతిభను వెలికి తీయడంలో 70 శాతం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విఫలమవుతున్నారు. విద్యార్థులు ఆనందంగా జీవించండి. జీవితం చాలా అందమైంది. మార్కులు, ర్యాంకులకోసం ప్రాణాలు తీసుకోకండి. మీరు చదివిన దాంట్లో ఎంత గుర్తుంటే అంతే రాయండి. ఫెయిల్ అయినా తిరిగి మళ్లీ విజయం సాధించే వరకు ప్రయత్నించండి. మానసికంగా కుంగిపోతే వెంటనే టెలీమానస్‌ను సంప్రదించండి. తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యం చెప్పండి.

– జవహర్‌లాల్ నెహ్రూ,
సీనియర్ సైకాలజిస్ట్, టెలీమానస్